ఆడది మరో ఆడదాని దగ్గరకు సాయంకోసం వచ్చినపుడు లాలింపుతో కూడిన ప్రేమ కనబరుస్తుంది. ఇది తల్లీకూతుల్ల నడుమైనా ప్రక్కింటాళ్ళ మధ్యనైనా, అవసరాన్ని బట్టి ప్రేమాభిమానాలు కురిపించటంలో స్త్రీ చేసుకునే రంగాలంకరణ చాలా పకడ్బందీగా, పటిష్టంగా వుంటుంది.

“నీ ఇష్టం లేకుండానే బావతో నీ పెళ్లి ఎలా జరుగుతుందే. మీ నాన్న పిచ్చికాకపోతే... అయినా రెండురోజులు పెళ్ళాం మంచమెక్కగానే తగుదునమ్మా నంటూ నీ వెంట పడటమేనా? రెప్పొద్దున మీ అక్క బాగయి కాస్త కండ పెట్టగానే నీ వైపు చూస్తాడా? అయినా రెండో పెళ్ళివాడిని చేసుకోవడం నీకేం ఖర్మ....”

లలిత వింటుందో లేదోనని ఆగింది తల్లి.

“ఆ బట్టలు నేను పిండేస్తాలే... నువ్వెళ్లి ముఖం కడుక్కొని బొట్టు పెట్టుకో...” కూతురి పట్ల ఆప్యాయత గుమ్మరించింది.

అయినా లలిత అక్కడ తననెవరూ పలకరించటం లేనంత ముభావంగా తన పని చేసుకుంటోంది.

“నీకు రెండో పెళ్ళి చస్తే కానివ్వను. నువ్వు బాధపడకు. రేపు వెంకట్రావు మామయ్యకు ఉత్తరం రాస్తాను వెంటనే ముహూర్తాలు పెట్టించమని...” కూతురి ముఖాన్ని దొంగచాటుగా గమనిస్తూనే మాట పదిలంగా ఎడిచింది.

“మన ప్రసాదం' ఏదో వ్యాపారం చేసి బాగా సంపాదిస్తున్నాడట. నేనడిగితే కాదనరు. కట్నం, గిట్నం అంటే నామీద మిగిలిన బంగారాన్ని అమ్మేద్దాం... వింటున్నావా?” అనుమానంగానే అడిగింది తల్లి.

లలిత నోరు విప్పలేదు.

